క్లుప్తంగా

ఎండలో రీవిగా..



గురజాడ సర్కిల్ వద్ద హైమాస్ట్ లైట్ల స్తంభంపై పూలమొక్క

అల్లిపురం: ఒక పక్క ఎండలతో నగర ప్రజలు అల్లాడుతున్నారు. మరో పక్క ఎండలో కూడా రీవిగా తలెత్తుకుని ఒక విద్యుత్ స్తంభం పూలకిరీటం అలంకరించుకుని నగర నడిబొడ్డున నిల్చుంది. చూసిన వారంతా హైమాస్ట్ లైట్ల స్తంభంపై పూలుగుచ్ఛం ఎలా వచ్చిందా అని చూస్తున్నారు. సుమారు వంద అడుగుల ఎత్తులో తెల్లటి కాగితం పూలతో కూడిన పూలతీగ గాలికి తలాడిస్తూ ఆహ్లాదంగా కనిపిస్తుంది. ఆర్టీసీ కాంప్లెక్స్ దరి గురజాడ అప్పారావు సర్కిల్‌లో విద్యుత్ స్తంభం పైభాగాన పూలమొక్క నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

కార్మిక విభాగం కార్యదర్శిగా సత్యవతి



మహిళా కార్మికులతో సత్యవతి

దాబాగార్డెన్స్: ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) మహిళా కార్మిక విభాగం కార్యదర్శిగా నగరంలోని పెద జాలారిపేటకు చెందిన వి. సత్యవతి నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవీఎల్ పద్మ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జాలారిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో పద్మ మాట్లాడుతూ మహిళల కష్టసుఖాల్లో అండగా ఉండి, మంచి పేరు సంపాదించాలన్నారు. మత్స్యకార మహిళనైన తనను ఈ పదవిలో నియమించడం పట్ల సత్యవతి హర్షం వ్యక్తం చేస్తూ, తనకు కేటాయించిన పదవికి న్యాయం చేస్తానన్నారు. ముఖ్యంగా మహిళలకు అండగా ఉంటూ, వారికి సహకరిస్తానని పేర్కొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పెద్దరాజు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రేక్షకులకు చేరువగా మంచి సినిమాలు

సీతంపేట: మంచి సినిమాలను ప్రేక్షకులకు దగ్గర చేయడమే వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ముఖ్య ఉద్దేశమని సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. బుల్లయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం సొసైటీ గౌరవాధ్యక్షుడు ఆచార్య ఎన్.ఎ.డి.పాల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరయ్యేందుకు, ఎన్టీ రామారావు జయంతి నిర్వహణ, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యాలయం, సభ్యుల చేరిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు ఎ.కాశీ విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి వి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, ఆర్.బాబ్జి పాల్గొన్నారు.

ఆటలకు టాటా..
ఇక బడి బాట





వేసవి సెలవుల్లో ఆటపాటలతో సందడి చేసిన చిన్నారులు

- ముగిసిన వేసవి సెలవులు
- ఇక చదువులమ్మ ఒడికి చిన్నారులు

దాబాగార్డెన్స్: వేసవి సెలవులు ముగిసాయి. ఆటలకు పిల్లలు టాటా చెప్పి.. స్కూలు బ్యాగులు వీపునకు తగిలించుకుని పాఠాలు వినడానికి సిద్ధమయ్యారు. ఒక వైపు ప్రభుత్వ పాఠశాలలు.. మరోవైపు ప్రైవేటు పాఠశాలలు సరస్వతీ నమస్తుభ్యమంటూ విద్యార్థులను తమ వైపు ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు, విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడి ప్రైవేట్‌కు దీటుగా పని చేస్తున్నాయి. దీంతో సర్కార్ బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ఉచితంగా విద్యనందించడమే గాక, నూతన సాంకేతిక విధానాలు అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలలే మేలని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు.

అన్నీ ఉచితమే..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్నీ ఉచితమే. ముఖ్యంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫారాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది. ఇవే పుస్తకాలు బయట మార్కెట్‌లో కొనాలంటే కనీసం రూ.1200 నుంచి రూ.1500 అవుతుంది. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను రూపొందించి అందించనున్నారు. ప్రస్తుతం బూట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఏ లోటూ లేకుండా చూస్తున్నారు.

ఉచిత భోజనం..

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలకు ఉచితంగా మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఉదయం అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ప్రకాశరావుపేట జీవీఎంసీ పాఠశాల

నియోజకవర్గ పరిధిలో స్కూళ్లు..

ప్రభుత్వ క్వీన్‌మేరీ బాలికోన్నత పాఠశాల, ఎంవీడీ(లక్ష్మీటాకీస్) హైస్కూల్, దండుబజార్ జీవీఎంసీ హైస్కూల్, జీవీఎంసీ ప్రకాశరావుపేట హైస్కూల్, మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాల, చెంగల్రావుపేట ప్రాథమిక పాఠశాల, గణేష్ పాఠశాల (ప్రసాద్‌గార్డెన్స్), రమాదేవి భానోజీరావు ప్రాథమికోన్నత పాఠశాల (డాబాగార్డెన్స్), అల్లిపురం ప్రాథమిక పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈనెల 12 నుంచి 17 వరకు ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు పాఠశాలల నిర్వహించనున్నారు.

ఆటలకు స్వస్తి..

దాదాపు రెండు నెలల పాటు ఆటలకు పరిమితమైన పిల్లలు బడిబాట పట్టాల్సిన సమయం వచ్చేసింది. మండుటెండలను లెక్క చేయని కొందరు విద్యార్థులు నిత్యం ఆటలకే పరిమితం కాగా.. మరి కొందరు గ్రంథాలయాల్లో ప్రభుత్వం చేపట్టిన వేసవి విజ్ఞాన శిబిరాల్లో పాల్గొని పలు విషయాలు తెలుసుకోగలిగారు. నెలన్నర పాటు కిటకిటలాడిన క్రీడా ప్రాంగణాలన్నీ సోమవారం నుంచి బోసిపోనున్నాయి.

ఇరుగ్గా రహదారులు

- డస్ట్‌బిన్ల ఏర్పాటుతో కుదించుకుపోతున్న రోడ్లు



అల్లిపురం మోడల్ స్కూల్ వద్ద డస్ట్‌బిన్ వల్ల కుదించుకుపోయిన రహదారి

అల్లిపురం: జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. అల్లిపురం మెయిన్‌రోడ్డులో పలుచోట్ల డస్ట్‌బిన్లు రోడ్డులోని సగభాగాన్ని ఆక్రమించడంతో 30 అడుగుల రోడ్డు కాస్త కుదించుకుపోతుందని స్థానికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెయిన్‌రోడ్డులో గల కోదండ రామస్వామి దేవస్థానం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ముందు డస్ట్‌బిన్ ఏర్పాటు చేయటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా అల్లిపురం మోడల్ స్కూల్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా, దాని ముందు డస్ట్‌బిన్ ఏర్పాటు చేశారు. దానిని ఆసరాగా తీసుకుని వ్యాన్లు, ఆటోలు నిలుపుదల చేయటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అవరోధం ఏర్పడుతోంది. ఒక పక్క డస్ట్‌బిన్, మరో పక్క విద్యుత్ డీబీ బాక్సు మధ్య కనీసం పది అడుగుల దారి కూడా లేక తరచు ట్రాఫిక్ జామ్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాంధీ బొమ్మ దగ్గర గల ఒక లాడ్జి ముందు కూడా ట్రాన్స్‌ఫార్మర్ ముందు డస్ట్‌బిన్ ఏర్పాటు చేయటంతో రోడ్డు ఇరుగ్గా మారింది. అలాగే సింహాలదేవిడి వద్ద కూడా అదే పరిస్థితి నెలకొంది. ఈ మేరకు 34వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివను వివరణ కోరగా డస్ట్‌బిన్లను తరలించే వ్యాన్ డ్రైవర్లు ఆ విధంగా ఏర్పాటు చేసి వెళ్లిపోతున్నారని, ఎన్నిసార్లు చెప్పినా వారు తీరు మార్చుకోవటం లేదన్నారు.

ఆంగ్ల మాధ్యమంలో ముగిసిన విద్యాబోధన

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గత 6 రోజులుగా నిర్వహిస్తున్న ట్రైనింగ్ ఆఫ్ టీచర్స్–ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి మాట్లాడుతూ శిక్షణ విజయవంతమైందని పేర్కొన్నారు. శిక్షణలో సెల్ఫ్ అవేర్‌నెస్, వకాబులరీ, ప్రొఫిషియెన్సీ, ఎఫెక్టివ్ స్పీకింగ్ స్కిల్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ప్రొనౌన్సియేషన్, కొలబరేటివ్ లెర్నింగ్ అనే అంశాలపై ఎస్ఆర్‌సీ పరిధిలోని కళాశాలల అధ్యాపకులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 40 మంది అధ్యాపకులకు శిక్షణ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏజీవో డాక్టర్ సుధ, ఎస్ఆర్‌సీ కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష, మాస్టర్ ట్రైనర్స్ డి. అరుణపద్మ, డాక్టర్ జి. నాగశాంతి, డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, సంతోషి అనూష, డాక్టర్ జీవీవీ ప్రసాద్‌బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శిఖర ప్రతిష్టాపన మహోత్సవం



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఆలయ పునర్నిర్మాణం, ఆలయ శిఖర ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. వేద పండితుల ఆధ్వర్యంలో విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు యోగిని క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండప పూజలు, అధివాసాలు, జలాధివాసం, క్షీరవాసం, ధాన్యక్షయాధివాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ సిబ్బంది, సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం జరిగే శిఖర ప్రతిష్ఠ, మధ్యాహ్నం జరిగే భారీ అన్నసమారాధన కార్యక్రమాలకు టీటీడీ చైర్మన్, రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఆలయ పునర్నిర్మాణ దాత ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, దేవదాయ శాఖాధికారులు పాల్గొంటారని ఎర్నిమాంబ ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వెంకట సత్యసురేష్‌బాబా తెలిపారు.

31వ వార్డులో ఉచిత వైద్య శిబిరం

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధి 31వ వార్డు కనకలవీధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో ఆ వార్డు అధ్యక్షుడు బత్తిన నాగరాజు, వార్డు నాయకుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 320 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను వార్డు నాయకుడు నవీన్‌కుమార్‌కు వివరించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పక్షవాతంతో మంచం పట్టిన గెద్ద పైడిరాజును పరామర్శించి ఆర్థిక సాయం చేయడంతో పాటు తగిన వైద్యం అందిస్తానని తెలిపారు. అలాగే క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళను పరామర్శించి అవసరమైన మందులు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ పండగ ప్రారంభం



వంకలవీధిలో వెలసిన ముత్యాలమ్మ

దాబాగార్డెన్స్: స్థానిక 28, 29 వార్డుల గ్రామదేవత ముత్యాలమ్మ 23వ వార్షిక మహోత్సవం ఆదివారం నౌరోజీరోడ్డు, ఊటగెడ్డ, వంకలవీధిలో వెలసిన ముత్యాలమ్మ ఆలయం వద్ద ఘనంగా ప్రారంభమయింది. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామ పురవీధుల్లో చాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం ప్రధాన పండగ జరపనున్నారు. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరపనున్నారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. ఉదయం 6, 11 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు. 11.30 గంటలకు వెండి ఆభరణాలతో విశిష్ట దర్శనం కల్పించనున్నారు. భక్తులచే పసుపు కుంకుమ సమర్పించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి వంకలవీధి నుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 20న అమ్మవారి మారువారం జరపనున్నట్టు ముత్యాలమ్మ సేవా సంఘం తెలిపింది.

‘దేశానికి బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి’

దాబాగార్డెన్స్: బీజేపీ ప్రభుత్వం దేశానికి, రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పాలని, ఎటువంటి అభివృద్ధి లేకుండా, అభివృద్ధి చేసినట్టు ఉత్సవాలు జరుపుకోవడంలో ఆంతర్యమేంటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు తోట వాసుదేవరావు మండిపడ్డారు. కేంద్ర మంత్రి అమిత్‌షా విశాఖలో ఉత్సవాలు జరుపుకోవడాన్ని, బీజేపీ అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం గాంధీ పార్కులో నల్లచొక్కా ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ రాష్ట్ర విభజనలో ఇచ్చిన హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వలేనందుకా ఈ ఉత్సవాలు జరుపుకుంటున్నారని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తోట పేర్కొన్నారు.

వేటకు సన్నద్ధం

రెండు నెలల విరామం తరువాత గంగపుత్రులు వేటకు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి వేట నిషేధ సమయం కావడంతో మత్స్యకారులు పూర్తిస్థాయిలో పడవలను, వలలను సిద్ధం చేసుకున్నారు. మత్స్యకార గ్రామాల్లో ఏటా జరిగే గ్రామ దేవతల జాతరలు కూడా పూర్తవుతుండడంతో బుధవారం నుంచి వేటకు బయల్దేరుతున్నారు. ఫిషింగ్ హార్బర్‌లో సందడి వాతావరణం నెలకుంది. మరబోట్లు వేటకు సిద్ధమవుతున్నాయి. వేటకు అవసరమైన సరకులు సిద్ధం చేసుకుంటున్నారు. బోట్లు శుభ్రం చేసుకోవడం, నీరు నింపడం, విద్యుత్ సౌకర్యం, ఉప్పు బస్తాలు, ఐస్ నిల్వ చేసుకుంటున్నారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పడవను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు





సిద్ధమైన ఉప్పు బస్తాలు తరలిస్తున్న దృశ్యం

దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శనకు స్పందన



దయాల్‌బాగ్ దుస్తుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఆరిలోవ సీఐ సోమశేఖర్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వస్తు ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఫర్ ఉమెన్ బీఎస్సీ రెండో సంవత్సరం హోం సైన్స్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఇక్కడ 40 రోజులు పాటు డ్రెస్ డిజైనింగ్‌లో శిక్షణ ఇచ్చారు. కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు తర్ఫీదు పొంది తయారు చేసిన కుర్తాలు, నైటీలు, గౌన్లు, పైజమాలు, టీషర్టులు తదితర వాటిని ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు ఆదివారం ప్రదర్శించి, విక్రయించారు. ఈ ప్రదర్శనను ఆరిలోవ సీఐ సోమశేఖర్ ప్రారంభించారు. అనంతరం ఆయన ఇక్కడ ప్రదర్శనలో పెట్టిన వస్తువులను పరిశీలించారు. శిక్షణ పొందిన విద్యార్థినులతో మాట్లాడి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు చేతి వృత్తిలో నైపుణ్యం ఉంటే భవిష్యత్‌లో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి, కార్యదర్శి డాక్టర్ రాజేష్ వెంకట్, శిక్షణ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

శిక్షణతో మెరికల్లా మెరిసి..

- వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకున్న చిన్నారులు
- గతనెల 8న ప్రారంభమై.. ఘనంగా ముగింపు



బాలల శాఖా గ్రంథాలయంలో భోజనం చేస్తున్న చిన్నారులు



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: గత నెల 8న ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిసాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఖాళీగా తిరగ కుండా వారు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు, వారిలో దాగిన సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనిలో భాగంగా ప్రతి రోజూ విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, యోగా వంటి సృజనాత్మక కార్యక్రమాలపై తర్ఫీదు ఇచ్చారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేసిన ఘనత మన ప్రభుత్వానిదే..

పాఠశాలలతో పాటు గ్రంథాలయాలు అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ మాట్లాడుతూ చిన్నారులకు మధ్యాహ్న భోజనం, అమ్మఒడి, విద్యా దీవెన, ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, బ్యాగ్‌లు ఇవ్వడమే గాక, నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను ఆధునీకరించడం విద్యార్థులకు వరమన్నారు. చిన్నారులంతా గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. 40 రోజుల పాటు నిర్వహించిన శిబిరంలో పలు పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. రీసోర్స్‌పర్సన్స్ సంజీవకుమార్, అనురాధను సత్కరించారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శిబిరంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నామని చిన్నారులు వివరించారు. కార్యక్రమంలో ఆడిటర్ సీహెచ్ మూర్తి, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, డిప్యూటీ లైబ్రేరియన్ ఇన్‌చార్జి పీవీ సూకరాజు, రాజేంద్రవర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

పూర్ణామార్కెట్ రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రటరీ ఆర్‌సీహెచ్ వెంకట్రావు, ఆడిటర్ సీహెచ్ మూర్తి, జి. అనురాధ, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. వివిధ ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారి పోలితల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు విద్యార్థినులకు ఆహ్వానం



ఎన్ఎంసీ హైస్కూల్-జూనియర్ కళాశాల

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీ హైస్కూల్, బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ తెలిపారు. అత్యున్నత విద్యార్హతలు, అంకితభావం గల అధ్యాపక బృందం, వివేకంతో కూడిన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరేందుకు బాలికలు వెంటనే అడ్మిషన్లు తీసుకోవాలని కోరారు. బైపీసీ గ్రూప్‌లో 40 సీట్లు, ఎంపీసీలో 40 సీట్లు చొప్పున ఉన్నాయని చెప్పారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫారం, మధ్యాహ్న భోజన పథకంతోపాటు ఉచితంగా ప్రభుత్వ హాస్టల్ సదుపాయం ఉందన్నారు. అమ్మ ఒడి పథకం వర్తిస్తుందని తెలిపారు. నువ్వే మా నమ్మకమని నమ్ముతున్న జగనన్న విద్యా దీవెన పథకం ఆశయాలకు అనుగుణంగా.. ‘ఆడపిల్ల చదువు అవనికి వెలుగు’ అని నిరూపిద్దామని హెచ్ఎం పిలుపునిచ్చారు.

ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో డిజిటల్ బోర్డుల ఏర్పాటు

సీతమ్మధార: నూతన విద్యా విధానానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో 20 డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామ్‌సంగ్(సర్వీసింగ్) కంపెనీ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ విశాఖ అర్బన్ ప్రభుత్వ పాఠశాలల్లో 160 బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో 20 బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ: ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ 14వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముడసర్లోవ సమీప స్కిల్ డెవెలప్మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద ఉన్న అసోసియేషన్ కార్యాలయాన్ని సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ 11వ వార్డు నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేశారు. ముందుగా ఇటీవల ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో మృతులకు సంతాపం తెలిపారు. అనంతరం గొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఇక్కడి ఆవరణలో బోరు తీయించే ఏర్పాటు చేస్తానన్నారు. నడక ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, పలువురు సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, సభ్యులు పి.శంకరరావు, వై.బాలరాజు, మధుసూదనరావు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.